**కథ**

# అవగాహన

**ఏ హావభావమంతీ లేకుండా ముభావంగా కూర్చున్న వాసంతి వైపు ఆశ్చర్యంగా చూశాడు హరీష్. కేంపుకెళుతున్నప్పుడు సూట్‌కేసు సర్దుకుంటూంటే- అవీ, ఇవీ అందిస్తూ- "ఎప్పుడు వస్తారో ఏవిటో" అంటూ గలగలా మాట్లాడే వాసంతి ఆరోజు తన స్వభావానికి విరుద్ధంగా మౌనంగా కూర్చోవటం అతనికి వింతగా అనిపించింది.**

అటూ ఇటూ చూస్తూ- 'నేనిక్కడ ఫైలొకటి పెట్టాను. ఏదీ?'' అనడిగాడు.

''ఏమో నాకు తెలీదు. ఎక్కడ పెట్టారో వెతుక్కోండి'' విసురుగా జవాబు చెప్పింది.

హరీష్ అటూ ఇటూ చూసి టీపాయ్ మీదున్న ఫైలుని తీసుకుని సూట్‌కేసులో పెట్టి లాక్ చేశాడు. వాసంతి పక్కన కూర్చుని అన్నాడు- ''ఊరెళ్తున్న వాళ్లని సాగనంపవలసింది చిరునవ్వులతో కానీ చిటపటలతో కాదు''

''మనసుకి కష్టం కలిగినప్పుడు ముఖం మీద నవ్వులెలా వెలుగుతాయి'' సీరియస్‌గా అంది.

''నీ బుజ్జి మనసుకు వచ్చినంత పెద్ద కష్టం ఏమిటబ్బా?'' ఆశ్చర్యం నటిస్తూ వేళాకోళంగా అన్నాడు హరీష్.

వాసంతి సమాధానం చెప్పకుండా కోపంగా చూసింది.

హరీష్ వాసంతి భుజం చుట్టూ చేయి వేసి అనునయంగా అన్నాడు- ''ఏమైనా చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది? ఎందుకలా ఉన్నావు? కారణమేమిటో నాకు చెప్పు మరి''

''మావయ్యగారూ, రామానుజంగారూ వరండాలో కూర్చుని మాట్లాడుకుంటుంటే నేను ఇద్దరికీ కాఫీ తీసుకువెళ్లి ఇచ్చాను...''

''నువ్విక చెప్పనవసరం లేదులే. నాకు అర్థం అయిపోయింది. రామానుజంగారు నీతో 'అమ్మాయ్! శ్రీరామనవమి నాడు తప్ప నేను పానకం తాగనమ్మా. మీ అత్తయ్యనడిగి కాఫీ తీసుకురామ్మా' అని నీతో చెప్పి ఉంటారు. అవునా? ఆయనంతే వసూ, ఎప్పుడూ నిజం మొహమ్మీదే చెప్పేస్తారు. మనసులో దాచుకోలేరు. అసలు లౌక్యం తెలియదు. నువ్వేం ఆయన మాటలు పట్టించుకోకు''

హరీష్ పెదవులపైకి వచ్చిన కొంటె నవ్వుకు వాసంతి కోపం ఇంకా రెట్టింపయింది.

''ఎప్పుడో ఒకసారి కాఫీలో పంచదార పొరపాటున ఎక్కువ వేశానని అస్తమానూ వెక్కిరించనక్కరలేదు. కాఫీ బాగానే వుంది. ఆయన ఇష్టంగానే తాగారు'' రోషంగా చెప్పింది.

''మరి నీ మనసుకు కలిగిన కష్టానికి కారణం ఏమిటో చెప్పు మరీ''

''వాళ్లకి కాఫీ ఇచ్చినప్పుడు ఇలాగే... అంటే నైటీలోనే వున్నాను. రామానుజంగారు వెళ్లాక అత్తయ్య కాఫీ కప్పులు తీసుకురావటానికి వెళ్లినట్టున్నారు. అప్పుడు మావయ్యగారు అత్తయ్యతో చెబుతున్నారు... 'నైటీ అంటే రాత్రిపూట వేసుకునేది కదా. పొద్దున్నే లేవగానే చీరగానీ డ్రెస్సుగానీ వేసుకుంటే బావుంటుందని అమ్మాయ్‌కి చెప్పకూడదూ. వాళ్లిద్దరే ఉంటున్నప్పుడయితే పర్వాలేదు గానీ నలుగురున్న ఇంట్లో ఎవరో ఒకళ్లు వచ్చిపోతుంటారుగా, నైటీలోనే వుంటే అంత బావుండదేమో అనిపించింది' అని. నేనప్పుడు హాలులో టీవీ తుడుస్తున్నాను. అందుకే నాకూ ఆ మాటలు వినిపించాయి. అత్తయ్య 'నేను చెప్పలేనలా. మనకి ఇప్పటి పద్ధతులు తెలియక కొత్తగా ఉందేమోకానీ అందరూ ఇప్పుడు అలాగే వేసుకుంటున్నారు' అని సమాధానం చెప్పారు''

వాసంతి మాటలకు హరీష్ అడ్డం వచ్చాడు. ''ఇందులో నువ్వు బాధపడటానికి ఏముందీ?''

''ఏం లేదా? డ్రెస్సు గురించి మరొకరితో అనిపించుకోవటం చిన్నతనంగా ఉండదా? ఇప్పటి రోజుల్నిబట్టి అందరిలాగే నేనూ వేసుకుంటున్నాను. కానీ నేనేదో అభ్యంతరకరమైనవి వేసుకుంటున్నట్టుగా అలా మాట్లాడేసరికి నాకు కష్టంగా అనిపించింది''

''ఇంత చిన్న కారణానికే అంతలా ఫీలవుతున్నావా?''

''అవును. నాకిష్టమైనట్టుగా నేను ఉంటానంతే. కానీ ఇంకొకళ్లు చెప్పినట్టుగా ఉండను. చిన్నప్పటి నుంచీ నా అలవాటు అదే'' రోషంగా అంది వాసంతి.

హరీష్ నవ్వాడు. ''నీ ఇష్టం వచ్చినట్టుగానే ఉండు. కాదనే వాళ్లెవరూ లేరు. నాన్నగారు ఏదో నీకు సలహా ఇచ్చినట్టుగా చెప్పమన్నారే తప్ప తప్పనిసరిగా ఇలాగే వుండాలని చెప్పలేదుగా. ఇక ఆ సంగతి మర్చిపో. నేను వెళ్లొస్తాను'' అంటూ హరీష్ విడిగా వెళ్లిపోయాడు.

తను ఫీలవటానికి కారణమేమీ లేదన్నట్టుగా హరీష్ మాట్లాడడంతో వాసంతి కోపం ఇంకా పెరిగింది.

రెండు రోజులు వాసంతి తను చేసే పనులు చేస్తూ, ముక్తసరిగా మాట్లాడుతూ ఎక్కువ సమయం తన గదిలోనే గడపటం చేసింది.

వాసంతి మామూలుగా లేదనే విషయాన్ని గమనించిన జగన్నాధరావుగారు భార్యని కారణం ఏమై వుంటుందని అడిగారు.

రుక్మిణమ్మగారు- ''ఆరోజు మీరు నాతో నైటీ గురించి కోడలికి చెప్పమని అన్నారుగా. అప్పుడిక్కడే హాల్లోనే వాసంతి ఉంది. నేను లోపలికి వచ్చినప్పుడు తనని చూడగానే మీ మాటలు వినబడ్డాయని నాకు అర్థమైంది. ముఖం చిన్నబుచ్చుకున్నట్టుగా కనిపించింది'' అన్నారు.

''ఆ విషయానికే అమ్మాయికి కోపం వచ్చిందంటావా? తన దుస్తుల విషయంలో నేనవసరంగా జోక్యం చేసుకున్నట్టుగా అనిపించిందేమో! మనకి ముగ్గురూ మగ పిల్లలవటం వలన ఇప్పటి పిల్లల బట్టల గురించి అంతగా తెలియక నాకు కొత్తగా అనిపించి అలా చెప్పానంతే. ఏమీ అనుకోవద్దనీ, తన ఇష్టప్రకారమే చేయొచ్చని చెప్పనా''

''అలా చెప్పటం ఏం బావుంటుందీ. చిన్న విషయాన్ని పెద్దదిగా చేసినట్టు ఉంటుంది. చిన్నతనం కదా, ఏదో అలిగింది. ఆ అలక ఎన్నాళ్లుంటుందీ, నాలుగు రోజుల్లో మామూలయిపోతుందిలెండి''

''నిజమే కావచ్చు. కానీ... అందరితో గలగల కబుర్లు చెబుతూ సందడిగా తిరిగే వాసంతి ముభావంగా తిరుగుతోంటే ఏదో వెలితిగా, ఇంటి కళే పోయినట్టుగా లేదూ''

''ఆ సంగతి నిజం. కోడలు మనలో ఇంతలా కలిసిపోతుందని నేనూహించలేదు. ఒక్కతే అమ్మాయిగా గారాబంగా పెరిగిన అమ్మాయి నలుగురున్న ఇంట్లో కలివిడిగా ఉండగలదా, నాకు కొంచెం ఆసరా అవుతుందా లేదా అని భయపడ్డాను. కానీ పుట్టింట్లో ఏ పనీ చేసిన అలవాటు లేకపోయినా మనింటికి వచ్చిన నెలలోనే నాకూడా ఉంటూ అన్ని వంటలూ నేర్చుకుంది. ఇప్పుడు పిల్లలెవరూ వాళ్లకి ఏమైనా కావలసి వస్తే నన్నడగటం లేదు. వాసంతినే అడుగుతున్నారు'' నిట్టూ

రుస్తూ అన్నారు రుక్మిణమ్మ.

''అందుకే కదా అలాంటి అమ్మాం మనసును నొప్పించానని మధనపడుతున్నాను'' అన్నారు జగన్నాధరావుగారు విచారంగా.

''ఇంత చిన్న విషయం గురించి మీరు మరీ ఎక్కువగా ఆలోచిస్తున్నారు. రెండు రోజుల్లో తనే మామూలవుతుందని చెబుతున్నాగా. ఆత్మీయుల మధ్య వచ్చిన అపోహలూ, అలకలూ ఎన్నాళ్లుంటాయి లెండి. నీటి బుడగల్లా తేలిపోతాయి''

రుక్మిణమ్మగారి మాటల్ని నిజం చేసింది ఆ మరునాడు జరిగిన సంఘటన.

★ ★ ★

ఆ మర్నాడు ప్రతీ రోజులాగే కంప్యూటర్ క్లాసుకి వెళ్లింది వాసంతి.

మధ్యాహ్నం రెండు గంటలకి వెళ్లి సాయంకాలం ఆరు గంటలకి వచ్చేస్తుంది. ఆ ఇన్‌స్టిట్యూట్ జగన్నాధరావుగారి స్నేహితుడు పెట్టిందే. కొంచెం దూరంగా వున్నా తెలిసిన వాళ్లది కదా అని అందులోనే చేరింది.

ఆరోజు ఒక ఆటో డ్రైవర్‌కీ, బస్ డ్రైవర్‌కీ జరిగిన ఘర్షణ కొట్లాటగా మారి ఒకరు చనిపోయారు. ఆ గొడవతో సాయంకాలం నాలుగు గంటల నుంచీ ఆటోలూ, బస్సులూ ఏవీ తిరగటం లేదు. ఆపైన మబ్బులు బాగా మూసుకువచ్చి కాసేపటిలోనే ఈదురు గాలీ... వర్షం మొదలయ్యాయి.

జగన్నాధరావుగారు, రుక్మిణమ్మగా వాసంతి కోసం ఆదుర్దాగా ఎదురుచూస్తున్నా . ఆరు గంటలు దాటినా ఇంటికి రాలేదు. ఏం యాలో తోచలేదు. ఫోను కూడా పనిచేయటం లేదు. ఎవరినైనా పంపించే వీలూ లేదు. హరీష్ ఊళ్లో లేడు. మిగతా పిల్లలిద్దరూ ఇంటికి ఇంకా చేరలేదు.

జగన్నాధరావుగారు ఆందోళనగా అటూ ఇటూ తిరుగుతోంటే రుక్మిణమ్మగారు అన్నారు- ''పిల్లలందరూ ఎలా వస్తే వాసంతీ అలా వస్తుంది. కొంచెం లేటవుతుందంతేగానీ కంగారు పడా



ల్సిందేం వుందీ''

''ఇలాంటి పరిస్థితిలో ఎవరో ఒకళ్లు వచ్చి తీసుకెళ్తారు. మనకేమో ఎవరూ లేక పోయారు. హరీష్ ఊళ్లో లేడనుకుంటే పిల్లిద్దరూ కూడా ఎందువల్లో ఇంటికి రాలేదింకా. ఆ గొడుగు ఇలా తే.. నేనే వెళ్లి వస్తాను. రామం ఇంటికెళ్లి అతని కారు అడిగి తీసుకువెళ్తాను'' అన్నారు జగన్నాధరావుగారు.

''ఏ...మి...టి... రామంగారింటి వరకూ ఈ గాలివానలో నడిచి వెళ్తారా? మీకేమైనా మతిపోయిందా? రామంగారిల్లు దాదాపు ఆ ఇన్‌స్టిట్యూట్‌కి పక్కనే కదా. అంత దూరం నడిచి వెళ్లగలనని అనుకుంటున్నారా?'' ఆశ్చర్యంగా అన్నారావిడ.

''ఏం పర్వాలేదులే. వెళ్లగలను. అసలు దారిలో ఏవైనా ఆటోలు తిరుగుతూ కనిపిస్తే సమస్యే ఉండదు. ఇంట్లో ఎదురుచూస్తూ కూర్చుంటే నాకు స్థిమితంగా లేదు. వెళ్తేనే సరిపోతుంది'' అంటూ రుక్మిణమ్మగారి అభ్యంతరాన్ని లెక్క చేయకుండా గొడుగు తీసుకుని బయలుదేరారు.

★ ★ ★

జగన్నాధరావుగారు వెళ్లేసరికి ఇన్‌స్టిట్యూట్ వరండాలో వాసంతి కూర్చుని ఉంది. కారులో నుంచి దిగిన ఆయన్ని చూసి రిలీఫ్‌గా ఫీలయింది.


''మా సార్ ఇప్పుడే బైక్ మీద తడుస్తూనే ఇంటికి వెళ్లారు. ఇంటికి వెళ్లాక నన్ను పంపించటానికి ఏదయినా ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఇంతలో మీరే వచ్చారు'' అంది వాసంతి తేలికపడిన మనసుతో.

జగన్నాధరావుగారు రామంగారింటి వరకూ కాలినడకన వచ్చేరని తెలిసి వాసంతి విస్తుపోయింది.

గోగినేని మణి

''ఇంత దూరం ఈ వానలో ఎం నడవగలిగారు మావయ్యా! ఇలాం పని ఎందుకు చేశారూ? నేనే ఎలా కాసేపటిలో వచ్చేదాన్నిగా'' అం వాసంతి బాధపడుతూ.

''నువ్వు ఏం ఇబ్బంది పడతా నని ఆదుర్దాలో నాకు దూరమే తె యలేదమ్మా. సునాయాసంగా నడి శాను. మీ అత్తయ్య నువ్వన్నట్టుగా అందిగానీ ఇంటి దగ్గర స్థిమితం ఉండలేకపోయాను. ఆదుర్దాగా ఎం రుచూడడం కంటే మెల్లగా నడవడ నయమనిపించింది'' అన్నారు చిరు నవ్వుతో.




వాసంతి కళ్ళు తడి అయ్యాయి. ఆ వయసులో అంత దూరం అంత వర్షంలో నడవటం అంటే మాటలు కాదు మరి! వాసంతి మనసు మావయ్య గారి పట్ల కృతజ్ఞత, అభిమానంతో నిండిపో యింది.

చిన్నప్పటి నుంచీ తన ఇష్టానుసారంగా, తనకు నచ్చిన విధంగా చేయటం అలవాటు ఏ పైనా. అలా పెరిగిన తను అత్తవారింట్లో ఉమ్మడి కుటుంబంలో ఎలాంటి ఇబ్బందులనెదుర్కోవలసి వస్తుం దోనని భయపడింది. కానీ కాపురా నికి వచ్చిన కొద్దిరోజులకే ఎలాంటి అరమరికలూ లేకుండా అందరితో బాగా కలిసిపోగలిగింది. అందరూ తన పట్ల చూపించిన ప్రేమాభి మానాలు అలాంటివి మరి. మామయ్యగారయితే మరీను. తన కేదైనా ఇష్టమని మాటలమధ్య చెబితే చాలు, మరునాటికల్లా అది తెచ్చిచ్చేవారు. అంత ఆప్యాయత చూపించేవాళ్లకి... చిన్న సలహా ఇచ్చే అధికారం కూడా లేదని చెప్పి నట్టుగా... నాలుగు రోజుల్నుండీ ముభావంగా ఉండిపోయింది. విజ్ఞ తలేని చిన్న పిల్లమాదిరి చిన్నత నంగా ప్రవర్తించింది. కారులో ఉన్నంతసేపూ అలా ప్రవర్తించినం దుకు వాసంతి మనసులోనే పశ్చా త్తాపపడింది, సిగ్గుపడింది.

ఇంటికి వచ్చాక- మావయ్యగా రిని వర్షంలో కాలి నడకన ఎందుకు పంపించారంటూ అత్తగారిమీద కోపం తెచ్చుకుంది. నవ్వుతూ మాట్లాడుతూ మునుపటిలా మామూలుగా ఉన్న కోడలిని చూసి పెద్దవాళ్ళిద్దరూ సంతృప్తిపడ్డారు.


రెండు రోజుల తర్వాత వాసంతి తనకున్న నాలుగైదు నైటీలను పేపరులో పాక్ చేసింది. ఆ పాకె ట్టును పనిమనిషి కోటమ్మ చేతికిచ్చి పక్కవీధిలో వున్న తన పిన్ని కూతురు సర ళకు ఇచ్చి రమ్మని చెప్పింది. అక్కడే వున్న రుక్మిణమ్మ గారు కోడలితో- ''అదేమి టమ్మా అలా ఎందుకు చేస్తు న్నావ్? మీ మావయ్య వద్దని అంటే దుగా, ప్రొద్దున్నే మార్చుకుంటే బావుంటుందని'' అని చెబుతోండగానే, మధ్యలోనే వాసంతి అడ్డంపడి అంది- ''నిజమే అత్తయ్యా. కానీ నాకు కొంచెం బద్ధకం ఎక్కువని మీకూ తెలుసుగా. పది, పదకొండు గంటలకి స్నానం చేసేవరకూ నైటీలోనే ఉండిపో తున్నాను. అందుకే ఇక రాత్రిపూట నావి పంజాబీ డ్రెస్సులు కాటన్‌వి చాలానే ఉన్నాయిగా, అవి వాడదామని అనుకుంటున్నా''

కోపం లేకుండా మామూలుగానే చెబుతోంది కదాని సరే అన్నట్టుగా తల ఊపారు రుక్మిణమ్మగారు.

కోటమ్మ వెళ్లిపోయింది. బయటకు వెళ్లిన జగ న్నాథరావుగారు లోపలికి వస్తూ- ''ఏమిటీ,

## సెంటిమెంట్!

**పెళ్లి, స్నేహితులు, చాలాబాగుంది లాంటి మంచి హిట్ చిత్రాల్లో నటిం చిన హీరో వడ్డే నవీన్‌కి ఈమధ్య కాలంలో చెప్పుకోదగిన సినిమాలేమీ లేవు. టైమ్ బాలేదని కాబోలు తన పేరుని కాస్త మార్చుకుని 'నవ్వీన్'గా అదృ ష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు 'ధనుష్' సినిమాతో. పేరులో తెచ్చిన ఈ చిన్న మార్పు నవీన్‌కి సారీ...నవ్వీన్‌కి ఎంతవరకూ కలిసొస్తుందో!**



కోటమ్మ అంత పెద్ద పాకెట్ పట్టు కెళ్తోందీ?'' అనడిగారు.

రుక్మిణమ్మగారు చిరునవ్వుతో ''వాసంతి ఇక నైటీలు వేసుకో దట. అందుకని తనవన్నీ చెల్లెలు సరళకు ఇచ్చిరమ్మని కోటమ్మతో పంపించింది'' అని చెప్పి ''ఏమిటీ, మీ చేతిలోని పాకెట్టూ, ఏం తెచ్చారూ?'' అనడిగారు.

''కోడలికి'' అంటూ ఆవిడకి అందించారు.

పాకెట్టును విప్పి చూసిన రుక్మి ణమ్మగారు నవ్వుతూ- ''ఏదో కథలోలా తమాషాగా జరిగిందే. వాసంతీ ఇటు చూడు, మీ మావయ్య నీకు ఏం తెచ్చారో'' అన్నారు.

అప్పుడే అటు వెళ్లబోతున్న వాసంతి వెనుదిరిగి చూసి తనూ నవ్వింది.

రుక్మిణమ్మగారి చేతిలో ఉన్నది... అందమైన గులాబీ రంగు నైటీ!